క్లుప్తంగా

క్రీడాకారులకు చేయూత



పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపూర్): మండల కేంద్రంలో గల క్రీడా మైదానంలో ఆడుకునేందుకు ఆట వస్తువులు కావాలని క్రీడాకారులు సర్పంచ్ వినీలారాణి, కుర్మయ్య దంపతులకు విన్నవించారు. వెంటనే స్పందించిన వారు ఆట వస్తువులను తీసుకొచ్చేందుకు ఆర్థికసాయం అందించారు. నగదును అందజేసిన సర్పంచ్ దంపతులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

అఖండ భజన, అభిషేకం కరపత్రం ఆవిష్కరణ



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో అఖండ భజన, అభిషేకం కరపత్రాలను గురువారం అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 15న ఆలయంలో రెండు తెలుగు రాష్ట్రాల భజన బృందాలు పాల్గొని 12 గంటల పాటు భజన చేస్తారని, ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



అమరచింత: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు పర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి ఎండీ గౌస్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో గురువారం సీపీఎస్ నూతన క్యాలెండర్‌ను ఎంపీడీఓ జ్యోతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను అమలు పర్చాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రాకేష్, కిరణ్, బాలుకుమార్, కరుణాకర్, ప్రదీప్, శివరాణి, జావేద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



వనపర్తి టౌన్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి నందిమల్ల రాంబాబు ఇటీవల జనవరిలో సూర్యపేటలో నిర్వహించిన ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీలో అగ్నివీర్‌కు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాల సిబ్బంది జిల్లా కేంద్రంలోని పాఠశాలలో శాలువాతో రాంబాబును సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. విద్యార్థులు రాంబాబు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి నరేష్ కుమార్, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా 'అధికారి'గా చెలామణి!

వనపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీలో జవాన్‌గా విధులు నిర్వహించే ఓ వ్యక్తి అత్యుత్సాహం కలకలం రేపుతోంది. మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రమేష్ సెలవులపై వెళ్లడంతో ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్ ఎవరికి కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించలేదు. బాధ్యతలు ఇవ్వకపోయినా తానే అధికారినంటూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీటుపై కూర్చొని మున్సిపాలిటీలో పనిచేసే ఓ జవాన్ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారు. తానే అధికారినంటూ ఇష్టారీతిగా వ్యవహరించడంతో మిగతా జవాన్‌లు, పారిశుద్ధ్య సిబ్బంది, కార్యాలయంలోని ఇతర విభాగాల అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కమిషనరే పట్టించుకోకపోతే మనకెందుకని మిన్నుకుండిపోతున్నారు. ఈ క్రమంలో గురువారం కౌన్సిలర్ వెంకటేష్ సదరు జవాన్ ఇష్టారీతిన వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే ఆయన పలు అవినీతి చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డిని వివరణ కోరగా.. ఏ జవాన్‌కు బాధ్యతలు ఇవ్వలేదని చెప్పారు.

30 లీటర్ల సారా పట్టివేత

పెంట్లవెల్లి: మండల పరిధిలోని ఎంగంపల్లితండాలో గురువారం 30 లీటర్ల సారా, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లుగా సీఐ ఎస్ఐ శంకర్ తెలిపారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, సిబ్బంది చిన్నగౌడ్, మహేష్, నారియానాయక్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'



ఆత్మకూర్‌లో కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని మూడో వార్డులో కౌన్సిలర్ అశ్విన్‌కుమార్ ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన వారికి అద్దాలు, మందులు ఇవ్వడంతోపాటు ఆపరేషన్లు చేయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నిస్సార్‌అహ్మద్, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అంధత్వ నివారణకు చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ చాంద్‌పాషా అన్నారు. మండలంలోని మస్తీపురంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను ఇవ్వడంలో, శస్త్ర చికిత్సల కోసం ఆస్పత్రులకు తరలిస్తున్నారన్నారు. గ్రామంలో ఐదో రోజు 150 మందికి పరీక్షలు నిర్వహించగా 15 మందికి కంటి అద్దాలను అందించారు. మరో 9 మందిని కంటి శస్త్ర చికిత్స కోసం సిపార్సు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీపిక, హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మస్తీపురంలో..

525 మందికి..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వెంగళాయిపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో గురువారం 525 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీరిలో 63 మందికి కంటి అద్దాలు, 46 మందికి కంటి ఆపరేషన్ కోసం సిపార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

120 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని శేరుపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో ఇద్దరికి రీడింగ్ అద్దాలను అందించడంతో పాటు ఆరుగురికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఎనిమిది మందికి ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్ కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



పెద్దమందడిలో మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

కొత్తకోట: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భాగ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం పీహెచ్‌సీ ఎదుట ఆశాలు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, ఆశాలు మంజుల, రజిత, అనసూయ, గోవిందమ్మ, భాగ్యలక్ష్మి, స్వాతి, చంద్రకళ, గీత, పుష్ప తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ఎన్నో ఏళ్లుగా ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని, సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిజ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పెద్దమందడి పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్‌కు అందజేశారు.

మదనాపురం: ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆస్పత్రి ఎదుట ఆశాకార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రానికి డాక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో అనసూయ, నీలమ్మ, మౌలాన్‌బీ, జ్యోతి, సుజాత, శారద, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వద్ద ఆశాకార్యకర్తలతో కలిసి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి నిరసన వ్యక్తం చేసి వైద్యులు నిస్సార్‌అహ్మద్, రంజిత్‌రెడ్డిలకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సత్యమ్మ, పుష్పలత, శ్యామల, గోపాలమ్మ, నవనీత, ఆకాంక్ష, జ్యోతి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలంలోని ఆశాకార్యకర్తలు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతుఆశాలకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఆశాకార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

తండాలో నెలకొన్న సమస్య పరిష్కరించాలి



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, జీపీకి రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరుతూ గురువారం తండాలో నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ శాంతమ్మ అధ్యక్షతన తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తండాలో విద్యుత్ సమస్యలు, గిరిజన బంధు, ఎస్టీ కార్పొరేషన్ రుణాలు, పేదలకు ఇళ్లు, ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు జీపీలకు అప్పగించడం, పెండింగ్ బిల్లుల మంజూరు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్, పంచాయతీ కార్యదర్శి నర్మద, తండా వాసులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ



పౌష్టికాహారం అందిస్తున్న సీఐ రత్నం

అమరచింత: క్షయ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉంటూ వైద్యులు సూచించిన మాత్రలు వేసుకుంటే త్వరితంగా వ్యాధి నుంచి కోలుకునే అవకాశం ఉందని సీఐ రత్నం అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా అందించే పౌష్టికాహార పదార్థాలను టీబీ వ్యాధిగ్రస్తులకు గురువారం అందించారు. ఆస్పత్రి వైద్యాధికారి వసంత, డాక్టర్ నిసార్ అహ్మద్‌తో కలిసి క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు అందించారు. వారం రోజుల కంటే ఎక్కువగా దగ్గు వస్తున్నా, దగ్గినప్పుడు తెమడతో పాటు రక్తం పడుతున్న వెంటనే వైద్యులను సంప్రదించి టీబీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రమాదం నుంచి కోలుకోనే అవకాశం ఉందన్నారు. రోగ లక్షణాలు కనపడితే కుటుంబ సభ్యులతో పాటు ఇతరులతో మాట్లాడుతున్న సందర్భంలో మాస్కులను వినియోగించాలని సూచించారు. డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాశ్ రెడ్డి ఆరునెలల పాటు పౌష్టికాహార పదార్థాలను అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా, జిల్లా యూత్ కమిటీ సభ్యుడు శ్యామ్, పోతురాము, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, స్టాఫ్‌నర్స్ శ్రీదేవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించండి

వీపనగండ్ల: తమ గ్రామం నుంచి మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు చదువుకునేందుకు వెళ్తున్న విద్యార్థులకు అనువుగా ఉండేలా ఆర్టీసీ బస్సులను నడపాలని గోపల్‌దిన్నె, రంగవరం గ్రామాల సర్పంచ్‌లు విజయ్‌కుమార్, వేముల జయసుధ ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నో రోజులుగా తమ గ్రామాలకు బస్సు వసతి లేకపోవడంతో పలువురు విద్యార్థులు అర్ధాంతరంగా చదువులను మానేస్తున్నారని వాపోయారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బస్సు వసతి కల్పించాలని కొల్లాపూర్, వనపర్తి ఆర్టీసీ డిపో అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి కొల్లాపూర్, వీపనగండ్ల, గోపల్‌దిన్నె, రంగవరం, నాగసానిపల్లి మీదుగా పెబ్బేరు పట్టణానికి షటిల్‌బస్సులను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

పన్ను బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యమొద్దు

పెబ్బేరు: మండలంలోని గ్రామాల్లో పన్ను బకాయిలను 100 శాతం వసూలు చేయాలని గురువారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్ అధికారులకు సూచించారు. 2023 మార్చి నాటిని అన్ని గ్రామపంచాయతీ పరిధిలో పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని కార్యదర్శులకు ఆదేశించారు. అలాగే రాంపూర్ గ్రామంలో పంచాయతీ రికార్డులు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, క్రిమిటోరియం, ప్లాంటేషన్ పనులు పరిశీలించారు. ప్రతి గ్రామంలో పారిశుభ్రత, హరితహారం పనులు, నర్సరీలో మొక్కలు పెంపకంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పంచాతీయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్య సేవలు చిరస్మరణీయం

పాన్‌గల్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు చంద్రయ్య సంస్మరణ సభకు గురువారం మండలంలోని కేతేపల్లి నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కాలం పాటు కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ప్రజల పక్షాన పోరాడిన చంద్రయ్య స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన సేవలు మరువలేనివి అన్నారు. కార్యక్రమంలో వంకా గోపాల్, కుర్మయ్య, సంతోష్, పెంటయ్య, చిన్ననారాయణ, కాశన్న, కుర్మయ్య, రాముడు, నర్సింహ్మ, హుస్సేన్, దేవమ్మ, వెంకటయ్య అలివేలమ్మ పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకంతో పేదలకు భరోసా



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): జాతీయ ఉపాధి హామీ పథకం 17వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ అఫ్జల్ కేక్ కట్ చేసి సిబ్బందికి తినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులకు ఈ పథకం ద్వారా ఎంతో మేలు కలిగిందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో పనిచేద్దాం



వీపనగండ్ల: రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన జూపల్లి కృష్ణారావు బాటలో ప్రతి ఒక్కరం పనిచేద్దామని రమేష్‌గౌడ్, రాముడు, పెంటయ్య, నర్సింహ, రాజయ్య అన్నారు. గురువారం కల్వరాలలో ఉద్యమ స్ఫూర్తిని తెలియజేసే క్యాలెండర్లను వారు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు పనిచేసిన జూపల్లికి రాబోయే రోజుల్లో మద్దతు పలకాలని వారు కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



పెబ్బేరు: పట్టణ కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పేదల కోసం నిర్మాణం చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ జాన్ కృపాకర్, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్‌బాబు, ఉమామహేశ్వర్‌రెడ్డి, సాయినాథ్, వేణుయాదవ్, మేకల ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావంతో మెలగాలి



అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులలో ఎంపిక చేసిన 40 మందికి స్పోర్ట్స్ మెటీరియల్‌తో పాటు పోలీసు యూనిఫాంలను గురువారం అందించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఎస్‌పీసీ ద్వారా విద్యార్థులకు సేవా కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

పరమశివుడికి ప్రత్యేక పూజలు



కొత్తకోట: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీ కోటిలింగేశ్వర ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం దినంలో శివుడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు అధిక సఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఆరుద్ర పూజలు చేశారు. శివలింగానికి పెద్ద సంఖ్యలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేసే వరకు పోరాటం



వనపర్తి టౌన్: ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను వెనక్కి తీసుకోవాలని ఎస్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు డిమాండ్ చేశారు. గురువారం తెల్లవారుజాము నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలను విస్మరించి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండటంతో సమస్యలు అధికమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, బదిలీలో జీఓ సర్వీస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, మధుసూదన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణానికి ఏర్పాట్లు



గట్టుకాడిపల్లిలో స్వామివారి ఆలయం

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లిలో వెలిసిన శ్రీ లక్ష్మీఅలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద కల్యాణ మహోత్సవం, పుష్పయాగం, సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. కల్యాణం కార్యక్రమానికి ఎప్పుడు లేని విధంగా ఈఏడాది ఆలయం ఎదుట 108 గుంజలతో పందిరి వేశారు. ఈ నెల 6వ తేదీ వరకు స్వామి ఉత్సవాలు జరుగుతాయని వారు చెప్పారు. కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వారు చెప్పారు.



స్వామివారి మూలవిరాట్



రూ.లక్ష విరాళం

పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహ వైన్స్ యజమాని శశాంక్‌గౌడ్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు గా విరాళం అందజేసిన వైన్స్ షాపు యజమానికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాముయాదవ్, రమేష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, మన్నెం, నిరంజన్‌యాదవ్, మహేష్ యాదవ్, వేణుయాదవ్, రాధకృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైతులు, కూలీలకు మొండిచేయి

వనపర్తి క్రైం: నిరుపేదలు, రైతులు, కూలీల కోసం కాకుండా సంపన్నులకు ఉపయోగపడే విధంగా కేంద్రం బడ్జెట్ ఉందని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనరసింహ కాలనీలో కేంద్ర బడ్జెట్ ప్రతులను ఐద్వా సంఘం మహిళలు తగలబెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పేదరికం లేకుండా చేసేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని గొప్పలు చెప్పుకున్న మోడీ సంపన్నులకు ఉపయోగపడేవిధంగా ప్రవేశపెట్టారని విమర్శించారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పి ఆ ఊసే పరిచారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రేణుక, శోభ, రంజనీ, పార్వతి, శేషమ్మ, సుశీలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: ఈనెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, రైతులకు, కార్మిక వర్గానికి కాకుండా పెట్టుబడుదారులకు, ధనవంతులకు ఉపయోగపడేలా ఉందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ నిర్మూలన కోసం స్పష్టమైన ప్రకటనలు ప్రకటించలేదని, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక నిధులు కేటాయించి, ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏదుట్ల కురుమయ్య, సుబ్బయ్య, గోవిందమ్మ, వెంకటయ్య, గంగమ్మ, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో రాస్తారోకో చేస్తున్న రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



మదనాపురంలో..

అమరచింత: ఆర్భాటంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ, ఆహార సబ్సిడీ రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలపై భారీ ఎత్తున కోత విధించడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రైతులను వ్యవసాయం నుంచి దూరం చేయడానికే గతంలో ఉన్న సబ్సిడీలపై కోత విధించారని మండిపడ్డారు. కార్యక్రమంలో అజయ్, వెంకటేష్, నరసింహ, మోహన్, బెక్కం విష్ణు, ఫయాజ్, జాంగిరు, వెంకటేష్, శ్రీను, విష్ణు పాల్గొన్నారు.

మదనాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అలాంటి బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రజలకు ఉపాధి హామీ, ఆహార సబ్సిడీ, రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలపై పెద్ద ఎత్తున కోత విధించారని దుయ్యబట్టారు. గ్రామీణ ఉపాధి హామీకి బడ్జెట్‌లో రూ.89 వేల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, సంపన్న వర్గాలకు దేశాన్ని దోచి పెట్టే విధంగా బడ్జెట్ ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చెన్నయ్య, ప్రసాద్, చిరంజీవి, నాగరాజు విజయ్, తిరుపతి, సవరన్న తదితరులు పాల్గొన్నారు.